సాక్షి
ఖమ్మం
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



కొనసాగుతున్న సమ్మె..

సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. 8లో



పంట నష్టపోయామని ఆందోళన

అధిక దిగుబడి వస్తుందన్న ప్రకటనలు నమ్మి నష్టపోయామని వరి సాగు చేసిన పలువురు రైతులు ఆందోళనకు దిగారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 24°

వాతావరణం

జిల్లా అంతటగా గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

పబ్లిసిటీ, బ్రాండింగ్ కమిటీ చైర్మన్‌గా పొంగులేటి



శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లో ఈనెల 16, 17, 18వ తేదీల్లో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరి బహిరంగ సభ నేపథ్యాన టీపీసీసీ పలు కమిటీలను ప్రకటించింది. ఇందులో పబ్లిసిటీ అండ్ బ్రాండింగ్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నియమించారు. చైర్మన్‌గా పొంగులేటితో పాటు మరో తొమ్మిది మంది కన్వీనర్లు, ఇంకో ముగ్గురు సభ్యులతో కలిపి కమిటీని నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కమిటీ చైర్మన్‌గా తనను నియమించిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్) ద్వారా భవన నిర్మాణ రంగంలో 18 నుంచి 45 ఏళ్లలోపు యువతకు ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌స్ట్రక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ సమయంలో రోజుకు స్టైఫండ్ రూ.300 చెల్లించడమే కాక భోజనం, యూనిఫామ్ సమకూర్చి సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే, 19 నుంచి 45ఏళ్లలోపు మహిళలకు మూడునెలల పాటు కుట్టు మిషన్ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 98857 25505, 90590 14197 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టెట్ కేంద్రాలకు సెలవు

ఖమ్మం సహకారనగర్: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) శుక్రవారం జరగనుంది. ఈ నేపథ్యాన పరీక్ష కేంద్రాలు ఉన్న విద్యాసంస్థలకు గురువారం మధ్యాన్నం నుండి శుక్రవారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమైక్యతా దినోత్సవంలో పాల్గొనాలి

ఖమ్మంసహకారనగర్: జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర సమైక్యతా దినోత్సవంలో అన్ని శాఖల అధికారులు అధికారులు, సిబ్బంది పాల్గొనాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమైక్యతా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈనేపథ్యాన 17వ తేదీన ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆయన సూచించారు.

కేఎంసీలో ప్రక్షాళన షురూ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంపై వరుస ఫిర్యాదులు వస్తుండడంతో ప్రక్షాళనపై అధికారులు దృష్టి సారించారు. ఈ విభాగంలోని బిల్ కలెక్టర్లు, ఇతర ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తుండడంతో కమిషనర్ ఆదర్శ్ సురభి అంతర్గత బదిలీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. ఇద్దరు ఆర్‌ఐలతో పాటు ముగ్గురు బిల్ కలెక్టర్లను ఇతర విభాగాలకు బదిలీ చేశారని సమాచారం. ఆర్‌ఐల్లో ఒకరిని ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న సీ1 సెక్షన్‌కు పరిమితం చేయగా, ఇంకొకరిని ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేసినట్లు తెలిసింది. ఇక బిల్లు కలెక్టర్లు ముగ్గురిని శానిటేషన్ విభాగం, జనన, మరణ ధృవీకరణ పత్రాల విభాగం, పెన్షన్ విభాగానికి బదిలీ చేసినట్లు సమాచారం. అలాగే, ఆర్‌ఐల సంఖ్యను రెండు నుంచి నాలుగుకు పెంచారని తెలిసింది. ఆయా పోస్టుల్లో ఇద్దరు వీఆర్‌ఏలు, ఇంకో ఇద్దరు సీనియర్ బిల్ కలెక్టర్లను నియమిస్తున్నారనే చర్చ జరుగుతుంది. అలాగే, బిల్ కలెక్టర్లకు ఏడు వేల వరకు అసెస్‌మెంట్లు అప్పగించగా ఈ సంఖ్యను 3వేల నుండి 3,500 వరకు కుదించనున్నారని సమాచారం.

రామయ్యకు స్నపన తిరుమంజనం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులకు అర్చకులు బుధవారం వైభవంగా స్నపన తిరుమంజనం చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇక శుక్రవారం ఆలయంలో లక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన ప్రభుత్వ మెడికల్ కళాశాల (ఇన్‌సెట్) భవనానికి తుదిమెరుగులు దిద్దుతున్న కార్మికులు

విధుల్లో చేరిన ప్రొఫెసర్లు

మెడికల్ కళాశాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో పాటు ప్రొఫెసర్లు, ఉద్యోగులను కూడా కేటాయించారు. ఆరుగురు ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 27 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇప్పటికే విధుల్లో చేరారు. ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో అధునాతన పరికరాలు, సౌకర్యాలు ఉండటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు జిల్లాల నుంచి చికిత్స కోసం వస్తున్నారు. దీంతో ఇప్పటికే ఖమ్మం వైద్యానికి ప్రధాన కేంద్రంగా నిలుస్తుండగా.. మెడికల్ కాలేజీ ప్రారంభంతో వైద్య రంగానికి హబ్‌గా మారుతుందని భావిస్తున్నారు.

వైద్య విద్యకు వేళాయె..

నేడు ప్రభుత్వ మెడికల్ కాలేజీ లాంఛనంగా ప్రారంభం

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ
- 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు
- పాత కలెక్టరేట్‌లో కళాశాల నిర్వహణకు పూర్తయిన ఏర్పాట్లు
- త్వరలోనే రూ.166 కోట్లతో నూతన భవన నిర్మాణం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం కేంద్రంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్ర వైద్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం కళాశాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాలు కలిపి మొత్తం ఎనిమిది ఎకరాల్లో కళాశాల ఏర్పాటైంది. ఈ ఏడాది 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభం కానుండగా.. ఇప్పటికే ప్రవేశాలు పూర్తయ్యాయి.

గత ఏడాది మంజూరు

ప్రతీ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఖమ్మంకు గత ఏడాది కళాశాలను మంజూరు చేసింది. ఆ వెంటనే పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, డీఎంహెచ్‌ఓ కార్యాలయాలను కేటాయించారు. మొత్తంగా ముప్పై ఎకరాల స్థలం అందుబాటులోకి రాగా.. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం కలిపి ఎనిమిది ఎకరాల్లో వైద్యకళాశాల ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంగణాల్లో భవనాల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.8.5కోట్లు కేటాయించడంతో చకచకా చేపట్టారు. అనంతరం పలుమార్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. కళాశాలకు అవసరమైన స్థలం నగర నడిబొడ్డున ఉండడం, ఇతరత్రా సౌకర్యాలు అనుకూలంగా ఉండడంతో అనుమతి జారీ చేశారు.

అంతా సిద్ధం

కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఈ విద్యాసంవత్సరం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 100 సీట్లతో నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి అనుమతులు లభించాయి. గతనెల 22వ తేదీన ఇద్దరు విద్యార్థులు ప్రవేశం పొందగా, దశల వారీగా మిగతా సీట్లు సైతం భర్తీ అయ్యాయి. పాత కలెక్టరేట్ ఆవరణలో పరిపాలన భవనం, లైబ్రరీ, టీచింగ్ హాళ్లు ఏర్పాటు చేయగా.. పాత పౌర సరఫరాల కార్యాలయం, ఈవీఎం గోదాంలో ల్యాబ్‌లు, లెక్చర్ హాళ్లు సిద్ధం చేశారు. ఇక పాత గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయాన్ని బయోకెమిస్ట్రీ, అనాటమీ శాఖల ఉద్యోగులకు, పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని బాలికల హాస్టల్‌గా, డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని బాలుర హాస్టల్‌గా తీర్చిదిద్దారు. ఆతర్వాత అంతర్గత రహదారుల నిర్మాణం కూడా పూర్తిచేశారు. ఇక ప్రభుత్వం విడుదల చేసిన రూ.166 కోట్లతో త్వరలోనే పూర్తిస్థాయిలో మెడికల్ కళాశాల భవనాలు నిర్మించనున్నారు.

మమత కళాశాల ముస్తాబు

రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆతర్వాత మమత మెడికల్ కళాశాల ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. అక్కడ నూతనంగా నిర్మించిన సిల్వర్‌జూబ్లీ బ్లాక్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కళాశాల ఆవరణలోని సభావేదికపై మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు 85వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. కాగా, మమత మెడికల్ కాలేజీని 1998లో 100 సీట్లతో ప్రారంభించగా దశల వారీగా ఇప్పుడు 200 సీట్లకు చేరింది. ఇక 2003లో 55 సీట్లతో పీజీ కాలేజీగా అవకాశం లభించగా, సీట్ల సంఖ్య 104కు పెరిగింది. ఇక్కడ వైద్య విద్యతోపాటు 23ప్రత్యేక విభాగాల్లో వైద్యసేవలు అందిస్తున్నారు.



మమత కాలేజీలో ప్రారంభించనున్న సిల్వర్ జూబ్లీ బ్లాక్

‘స్వచ్ఛ సర్వేక్షణ్’లో ముందు నిలపాలి

- జిల్లాస్థాయిలో 15 ఉత్తమ జీపీల ఎంపిక
- అవార్డులు అందజేసిన కలెక్టర్ గౌతమ్



రేగులచెలక సర్పంచ్ రామారావు, కార్యదర్శి సంగీతను సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్/రఘునాథపాలెం/కొణిజర్ల: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు గ్రామపంచాయతీల పాలకవర్గాలు కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ఉత్తమంగా ఎంపికైన 15 గ్రామపంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు బుధవారం కలెక్టరేట్‌లో ఆయన పురస్కారాలు అందజేసి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితుల ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు జిల్లాలోని 15జీపీలు ఎంపిక కాగా, ఇందులో రఘునాథపాలెం మండలంలోని రేగులచెలక గ్రామం రాష్ట్ర స్థాయి అవార్డు గెలుచుకుందని చెప్పారు. జీపీ సర్పంచ్ కొర్లపాటి రామారావు, కార్యదర్శి సంగీత గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితర చేతుల మీదుగా అవార్డు స్వీకరించనున్నారని తెలిపారు. ఈ గ్రామాల స్ఫూర్తితో జిల్లాలోని మిగతా గ్రామాల్లో కూడా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కాగా, జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, ఎంపీడీఓలు రామకృష్ణ, కె.మహాలక్ష్మి, ఎంపీఓలు శ్రీనివాస్‌రెడ్డి, పి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కొణిజర్ల సర్పంచ్ రామారావు, కార్యదర్శి రాజేశ్వరి

సీఎంను కలిసిన ప్రజాప్రతినిధులు



సీఎం కేసీఆర్‌తో జిల్లా ప్రజాప్రతినిధులు

వైరా/సత్తుపల్లి: జిల్లా ప్రజాప్రతినిధులు పలువురు సీఎం కేసీఆర్‌ను బుధవారం కలిశారు. హైదరాబాద్ ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రిని కలిసిన వారు వివిధ అంశాలపై చర్చించారు. కాగా, వైరా నియోజకవర్గానికి 100 పడకల ఏరియా ఆస్పత్రితో పాటు భవన నిర్మాణానికి రూ.37.50కోట్ల నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే రాములునాయక్ ఈసందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈసమావేశంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి, పినపాక ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, రేగా కాంతారావు, భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును రాములునాయక్ కలిసి 100 పడకల ఆస్పత్రి, నిధుల మంజూరు పత్రాలను అందుకున్నారు.

జిల్లా పంచాయతీ అధికారిగా హరికృష్ణ

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)గా ఈ.హరికృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జెడ్పీ సీఈఓ అప్పారావు ఇన్‌చార్జ డీపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న హరికృష్ణను ఖమ్మం డీపీఓగా బదిలీ చేశారు.

16న 927 క్వింటాళ్ల బియ్యం వేలం

ఖమ్మంసహకారనగర్: జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన వివిధ సందర్భాల్లో జప్తు చేసిన రేషన్ బియ్యాన్ని ఈనెల 16న వేలం వేయనున్నారు. కల్లూరు మండలంలోని గోదాంల్లో నిల్వ చేసిన 927 క్వింటాళ్ల బియ్యాన్ని వేలం ద్వారా విక్రయించనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.50 వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

మరోమారు కాంగ్రెస్ సత్తా చాటాలి

ఏఐసీసీ పరిశీలకుడు ఆరిఫ్ నసీంఖాన్



మాట్లాడుతున్న నసీంఖాన్, పక్కన రేణుకాచౌదరి తదితరులు

ఖమ్మంసహకారనగర్: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలను గెలవడం ద్వారా కాంగ్రెస్ సత్తాను మరోమారు నిరూపించాలని ఏఐసీసీ పరిశీలకులు, మహారాష్ట్ర మాజీ మంత్రి మహ్మద్ ఆరిఫ్ నసీంఖాన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరగనున్న విజయభేరి సభ సన్నాహక సమావేశం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో బుధవారం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నసీంఖాన్ మాట్లాడుతూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేతృత్వాన సమష్టిగా కృషిచేసి అన్నిస్థానాల్లో విజయం సాధించాలన్నారు. తద్వారా గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచి వలస వెళ్లిన నేతలకు గుణపాఠం చెప్పాలని సూచించారు. కాగా, విజయభేరి సభకు ప్రతీ నియోజకవర్గం నుండి 8వేల నుండి 10 వేల మంది తరలిరావాలని కోరారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు మంచి రోజులు రానున్నాయని తెలిపారు. సమావేశంలో నాయకులు కొత్వాల్, మహ్మద్ జావేద్, పుచ్చకాయల వీరభద్రం, శివకుమార్, వడ్డెబోయిన నరసింహారావు, బొడ్డు బొందయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోటనీ అధ్యాపకుడికి డాక్టరేట్


సోమపంగు బాబు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల బోటనీ అధ్యాపకుడు సోమపంగు బాబుకు డాక్టరేట్ లభించింది. ఓయూ బోటనీ విభాగం ప్రొఫెసర్ ఎం.సునీతారాణి పర్యవేక్షణలో ఆయన 'స్టడీస్ ఆన్ ఎంజియో స్పెర్మిక్ ఫ్లోరా ఆఫ్ వెట్‌లాండ్స్ అండ్ ఇట్స్ సరౌండింగ్ ఏరియాస్ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్ట్ – తెలంగాణ స్టేట్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఓయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా బాబును ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ.వీ.రెడ్డి, టి.జీవన్‌కుమార్, ఎగ్జామినేషన్ బ్రాంచ్ కంట్రోలర్ డీ.ఎన్.గోపి తదితరులు బుధవారం అభినందించారు.

సాయుధ పోరాటాన్ని నడిపింది కమ్యూనిస్టులే..


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించింది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను లెక్క చేయకుండా కమ్యూనిస్టులు పోరాడారని చెప్పారు. కానీ బీజేపీ నేతలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారని విమర్శించారు. కాగా, తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఈనెల 16న భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, జబ్బర్, భుక్యా శ్రీనివాసరావు, డి.తిరుపతిరావు, నవీన్‌రెడ్డి, మీరా సాహిబ్, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాలు జారి బావిలో పడి యువకుడు మృతి


ఆంజనేయులు(ఫైల్)

మధిర: ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిన యువకుడు మృతి చెందాడు. మండలంలోని మాటూరుకు చెందిన మేడిశెట్టి శివరామకృష్ణ – నాగమణి కుమారుడు ఆంజనేయులు(21) బుధవారం పత్తి చేనుకు మందు కొట్టేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఈక్రమంలో బావిలో నుంచి నీరు తీసుకొచ్చే క్రమాన కాలు జారి బావిలో పడడంతో మృతి చెందాడు. ఘటనపై మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా సాధన జేఏసీ బాధ్యులపై కేసు కొట్టివేత

సత్తుపల్లి: సత్తుపల్లిని జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపట్టిన సమయాన నమోదైన కేసును కోర్టు కొట్టివేసింది. జిల్లా సాధన కోసం జేఏసీగా ఏర్పడిన నాయకులు తల్లాడ మండలం పినపాక నుంచి అశ్వారావుపేట వరకు మార్చి 2019లో పాదయాత్ర చేపట్టారు. అప్పుడు పోలీసులు కేసు నమోదు చేయగా, విచారణ అనంతరం జిల్లా కోర్టు బుధవారం కొట్టివేసింది. జేఏసీ కన్వీనర్ ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, తడికమళ్ల యోబు, పానెం ఈశ్వర్, పిల్లి భాస్కర్, దాచేపల్లి చారి, వన్నెంరెడ్డి సాగర్ తదితరులపై అప్పట్లో కేసు నమోదైంది.

బొగ్గు లారీ బోల్తా

కామేపల్లి: అదుపు తప్పిన బొగ్గు లారీ బోల్తా కొట్టిన ఘటన మండలంలోని పాతలింగాల స్టేజీ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కర్ణాటక రాష్ట్రం నుంచి బొగ్గు లోడ్‌తో లారీ వస్తుండగా, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా పాతలింగాల స్టేజీ వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కామేపల్లి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ చేరుకుని లారీని క్రేన్ సాయంతో బయటికి తీసి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

పరస్పర దాడుల్లో గాయాలు

నేలకొండపల్లి: డ్రెయినేజీ విషయంలో ఇరువర్గాలు దాడులకు పాల్పడగా ఐదుగురికి గాయాలయ్యాయి. మండలంలోని అజయ్‌తండాలో ఇంటి ఎదుట డ్రెయినేజీ నీరు వెళ్లే విషయంలో ఇరువర్గాల మధ్య బుధవారం పంచాయితీ జరిగింది. అది పెరిగి పెద్దగా మారడంతో ఘర్షణకు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన రాజా, గోపి ఓ వర్గంగా, సీతారాములు, ఆనంద్, నారాయణ ఇంకో వర్గంగా విడిపోయి దాడులు చేసుకోవడంతో గాయాలయ్యాయి. ఈమేరకు గాయపడిన వారిని ఖమ్మం తరలించగా, రెండు వర్గాల వారి ఫిర్యాదుతో ఎస్సై జి.సతీష్ గ్రామంలో విచారణ చేపట్టారు.

విద్యుత్ మోటార్లు చోరీ

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంలో రైతులు సుంకర వెంకటేశ్వర్లు, గురిజాల విజయమ్మకు చెందిన వ్యవసాయ మోటార్లను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పంట చేతికొచ్చే సమయాన మోటార్లు చోరీకి గురికావడంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెడికల్ కళాశాల ముస్తాబు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభానికి ముస్తాబైంది. రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్ గురువారం కళాశాలను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల భవనాలకు రంగులు వేయడంతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. మరోపక్క లెక్చర్ హాళ్లు, ల్యాబ్‌ల్లో పరికరాలు సిద్ధం చేశారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఆస్పత్రిలోని క్యాజువాలిటీ


మెడికల్ కాలేజీలో సిద్ధం చేస్తున్న సభావేదిక


మానవ శరీర భాగాలపై బోధనకు ఏర్పాట్లు..


కాలేజీలోని లెక్చర్ హాల్


మీటింగ్ హాల్

నర్సింగ్ కళాశాల శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలన

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి మంత్రులు టి.హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఈసందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ గౌతమ్ బుధవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రూ.25కోట్ల వ్యయంతో ఐదెకరాల విస్తీర్ణంలో భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆతర్వాత యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో కళాశాల తాత్కాలిక నిర్వహణ కోసం ఏర్పాట్లపై ఆరా తీశారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, డీఈ శ్రీనివాస్, ఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సింగ్ కళాశాల శంకుస్థాపన ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్

గడువులోగా లేఔట్ అనుమతులు

ఖమ్మంమయూరిసెంటర్: లే ఔట్ల అనుమతి కోసం అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కేఎంసీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి లే ఔట్ కమిటీ సమావేశంలో ఆయన కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇరవై దరఖాస్తులను పరిశీలించి ఎనిమిదింటికి ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల్లోని వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేయాలని చెప్పారు. ఎస్‌డీసీ రాజేశ్వరి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, వివిధ శాఖల అధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకట్రాం, శ్రీనివాసులు, ప్రసాద్, వికాస్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మంసహకారనగర్: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌తో కలిసి గిరివికాసం, ట్రైకార్, ఆర్‌టీపీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు. సబ్సిడీ పథకాల విషయంలో బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. గిరిజన గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, విద్యుత్ ఎస్ఈ ఏ.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు కాళ్ళ ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.50వేల విలువైన యూనిఫాం పంపిణీ చేశారు. కళాశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి మాట్లాడుతూ దాతల చేయూతను అభినందించారు. అలాగే, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థినులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కాళ్ళ ఫౌండేషన్ చైర్మన్ పాపారావు, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై అశోక్, కార్పొరేటర్ రామ్మోహన్, అధ్యాపకులు శంకర్, విజయలక్ష్మి, శారద, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో ఏసీపీ, కాళ్ళ ఫౌండేషన్ బాధ్యులు

అర్హులకు అన్యాయం జరగనివ్వొద్దు

ఖమ్మంసహకారనగర్: బదిలీలు, పదోన్నతుల సందర్భంగా సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూడాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర నాయకుడు దేవరకొండ సైదులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ అనంతరం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరుగుతున్నందున ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా చేపట్టాలని విన్నవించారు. ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.యాదగిరి, ఎస్.కే.మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంవ్యవసాయం: ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ కార్మికులు, ట్రాన్స్‌కో సీబీడీ, ఎస్ఎంజీ కార్మికులు, మీటర్ రీడింగ్, ప్రైవేట్ బిల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.ప్రసాద్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 15న చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీక్షలో పుష్పరాణి, నాగేశ్వరరావు, సీతయ్య, గంట శ్రీను, కృష్ణమూర్తి, వీరయ్య, రాజా, గోవిందరావు, ప్రభాకర్, గురునాథం, నరేష్‌కుమార్, వీరబాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షలో పాల్గొన్న విద్యుత్ కార్మికులు

పంట నష్టపోయామని రైతుల ఆందోళన

సత్తుపల్లిరూరల్: ఎకరాకు 42 బస్తాల దిగుబడి వస్తుందనే నమ్మకంతో వరుణ్ సీడ్స్ కంపెనీ వరి విత్తనాలను సాగు చేస్తే నష్టం ఎదురైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సత్తుపల్లి శివార్లలో పంట సాగు చేసిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక సత్తుపల్లి మండలం గంగారానికి చెందిన రైతులు తాము 230 ఎకరాల్లో వరుణ్‌సీడ్స్ 1061 రకం వరి విత్తనాలు సాగు చేస్తే కొంత ముందుగానే ఈనగా, మరికొంత పొట్ట దశలో ఉండడంతో దిగుబడి పడిపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం గంగారం రింగ్‌సెంటర్ వద్ద నిరసన తెలిపారు. అధికారులు తమకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు బెజవాడ శ్రీనివాసరావు, మానిక మల్లేశ్వరరావు, పాకనాటి నాగరాజు, చింతా శ్రీను, నిమ్మటూరి వెంకటేశ్వరరావు, మహాదేవ గాంధీ, కోడిగంటి శ్రీను, కోటేశ్వరరావు తదితరులు డిమాండ్ చేశారు.


ఆందోళనకు దిగిన రైతులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

ఖమ్మంగాంధీచౌక్: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం చెల్లించాలనే తదితర డిమాండ్లతో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన మూడు రోజులుగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మె సాగిస్తున్నారు. జిల్లాలోని 700 మంది టీచర్లు, 600 మంది హెల్పర్లు సమ్మెలో పాల్గొంటుండగా, బుధవారం కార్యకర్తలు పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు. అలాగే, కబడ్డీ తదితర క్రీడలు ఆడుతూ నిరసన తెలిపారు. మరోపక్క సమ్మెలో పాల్గొనే అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల తాళాలు, స్మార్ట్ ఫోన్లు, ఇతర సరుకులను అప్పగించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అలాగే, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఈమేరకు పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు.


కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

యూరియా తరలింపుపై అనుమానాలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ స్టాక్ పాయింట్ నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా యూరియాను తరలించేందుకు చేసిన యత్నం చర్చనీయాంశంగా మారింది. ముదిగొండ మండలంలోని మల్లారం సొసైటీకి 450 యూరియా బస్తాలను రెండు ట్రాక్టర్లు, ఒక డీసీఎంలో బుధవారం తరలిస్తున్నారు. అయితే, వాహనాల డ్రైవర్ల వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవటంతో కొత్తకొత్తూరు సమీపాన కొందరు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆరా తీస్తుండగా, వాహనాలను తిరిగి నేలకొండపల్లి మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఈ విషయమై యూరియా పాయింట్ ఇన్‌చార్జ్ రాజశేఖర్‌ను వివరణ కోరగా... పత్రాలు వచ్చేంత వరకు ఆగాలని చెప్పినా డ్రైవర్లు వెళ్లారని తెలిపారు. ఈ విషయం తెలియగానే, వాహనాలను రప్పించామని అనుమతి పత్రాలు వచ్చాక పంపించినట్లు వెల్లడించారు.

సౌత్ ఇండియా కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు అందుకున్న వారితో పిచ్చయ్య, తదితరులు

సత్తుపల్లిరూరల్: సౌత్ ఇండియా కరాటే పోటీలు ఈనెల 9, 10వ తేదీల్లో కేరళలో జరగగా, ఖమ్మం జిల్లా కరాటే అసోసియేషన్ తరఫున పాల్గొన్న క్రీడాకారులు సత్తా చాటారు. సత్తుపల్లికి చెందిన ఎస్.శైలజ, ఖమ్మంకు చెందిన ఎం.మణిరత్నం కాంస్య పతకాలు సాధించారు. ఈసందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.పిచ్చయ్య తదితరులు క్రీడాకారులను అభినందించారు.

సమయానికి తెరుచుకోని పాఠశాల

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు ప్రాథమిక పాఠశాల(దళితవాడ) బుధవారం ఉదయం 10గంటలు దాటాక తెరుచుకుంది. పాఠశాల సమీపాన చేతి బోరు మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్ మారాబత్తుల మోహన్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ వేల్పుల స్వామి ఈ విషయాన్ని గుర్తించారు. ఉదయం 9గంటలకు రావాల్సిన ఉపాధ్యాయులు 10 గంటలు దాటాక రావడంతో వారు ఎంఈఓ ప్రభాకర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

బీరోలు మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

తిరుమలాయపాలెం: బీరోలు గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గతంలో సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన గుండా మాధవి, పంచాయతీ కార్యదర్శి సతీష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో సర్పంచ్‌గా మాధవి ఉన్నప్పుడు అభివృద్ధి పనుల పేరుతో కార్యదర్శితో కలిసి రూ.10లక్షల మేర అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై గ్రామస్తులు గతంలోనే కలెక్టర్‌తో పాటు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు ఫిర్యాదు చేయగా బుధవారం ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోనెసంచిలో మృతదేహం

● మెడకు తాడు బిగించి హత్య చేసి ఉంటారని అనుమానాలు

ఖమ్మంరూరల్: మండలంలోని పడమటితండా శివారు జాన్‌బాద్ తండాలో మున్నేటి ఒడ్డున గోనె సంచిలో గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహం లభ్యమైంది. గ్రామ సమీపంలోని శివాలయంలో పక్కనే మున్నేటి ఒడ్డున వ్యక్తి మృతదేహం గోనెసంచిలో ఉండడాన్ని బుధవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు చేరుకుని మూట విప్పగా దుర్వాసన వెదజల్లుతున్న మృతదేహం బయటపడింది. సదరు వ్యక్తి మృతదేహం మెడ, కాళ్లకు నైలాన్ తాడుతో కట్టి ఉండగా, కుడిచేయిపై ఓం అని రాసి ఉంది. సదరు వ్యక్తిని నైలాన్ తాడుతో ఉరివేసి హత్య చేశాక గోనెసంచిలో పెట్టి మున్నేరులో వేసి ఉంటారని భావిస్తున్నారు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

దేవరకొండ: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని కొమ్మేపల్లి క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలు.. ఖమ్మం జిల్లా సింగరేణి ప్రాంతానికి చెందిన చిమ్మల నరేశ్(31) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, మంగళవారం టేకులపల్లి నుంచి బొగ్గు లోడుతో దేవరకొండ మీదుగా ఏపీలోని కర్నూలుకు బయల్దేరాడు. మార్గమధ్యలో దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి శివార్లలో లారీ టైరు పంక్చర్ కావడంతో కొమ్మేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పంక్చర్ షాపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని చెన్నారానికి చెందిన మంకెన నారాయణ(35) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగాడు. కాసేపటి తర్వాత ఇంటి వచ్చిన కుటుంబీకులు ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, నారాయణ ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

ప్రైవేట్ గదిలో హాస్టల్ బియ్యం స్వాధీనం

పెనుబల్లి: పెనుబల్లిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌కు చెందిన పదిన్నర క్వింటాళ్ల బియ్యాన్ని ఓ వ్యక్తి ఇంటి నుంచి వీఎం.బంజర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హాస్టల్ సమీపంలోని ఓ ఇంట్లో బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో ఎస్సై సూరజ్ మంగళవారం గదిని సీజ్ చేశారు. బుధవారం సివిల్ సప్లయీస్ డీటీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. అయితే, హాస్టల్‌లోని స్టోర్ రూంలో కోతులు, ఎలుకల సమస్య ఉన్నందున అద్దె గదిలో బియ్యం నిల్వ చేశానని వార్డెన్ చెప్పారు. దీంతో ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

భూవివాదంలో తండ్రిపై కుమారుల దాడి

● చికిత్స పొందుతూ మృతి

సత్తుపల్లి: రెండెకరాల భూమి కోసం తండ్రీకొడుకుల నడుమ జరిగిన ఘర్షణ తండ్రిని బలితీసుకుంది. సత్తుపల్లి సీఐ మోహన్ బాబు కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన గుడ్ల శ్రీనివాసరావు(44)కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని తమకు పంచి ఇవ్వాలని ఆయన కుమారులు నరేష్, మధు కొన్నాళ్లుగా గొడవ పడుతున్నారు. ఈనేపథ్యాన బుధవారం రాత్రి కూడా ఘర్షణ జరిగింది. ఈక్రమంలోనే నరేష్, మధులు తమ తండ్రి శ్రీనివాసరావు పై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనకు సత్తుపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై శ్రీనివాసరావు సోదరుడు వీరభద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, మృతుడు శ్రీనివాసరావు మూడేళ్ల క్రితం భార్యను చంపిన కేసులో ముద్దాయిగా ఉన్నాడు.

రేపు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం

- ఒకేసారి అందుబాటులోకి 9 వైద్య కాలేజీలు!
- సీఎం చేతుల మీదుగా ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయి. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శుక్రవారం వాటిని ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామల్లో కొత్తగా ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర సొంత నిధులతో ఒకే ఏడాది ఇంత పెద్దసంఖ్యలో మెడికల్ కాలేజీలు ప్రారంభించడం దేశంలోనే ఇదే ప్రథమంగా చెబుతున్నారు.

కేసీఆర్ హయాంలోనే 21 మెడికల్ కళాశాలలు


తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, సీఎం కేసీఆర్ దశాబ్ద కాలంలోనే 21 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. కాగా, వచ్చే ఏడాది ప్రారంభించేందుకు మంజూరు చేసుకున్న 8 మెడికల్ కాలేజీలతో ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు పూర్తవుతుందని అధికారులు అంటున్నారు. 2014లో 5 మెడికల్ కాలేజీల ద్వారా 850 సీట్లు ఉంటే, 2023 నాటికి 26 మెడికల్ కాలేజీలతో సీట్ల సంఖ్య 3,690కి చేరింది. ప్రభుత్వ ప్రైవేటులో కలిపి ఏటా పది వేల మంది విద్యార్థులను తయారు చేసే స్థాయికి నేడు తెలంగాణ ఎదిగింది.

చట్టంలో మార్పులతో విస్తృత అవకాశాలు

2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్ కు ప్రభుత్వం సవరణ చేసిన సంగతి తెలిసిందే. గతంలో 85శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వుడుగా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. తాజా నిర్ణయం వల్ల మన విద్యార్థులకు మరో 520 సీట్లు దక్కాయి. దీంతో పాటు ఎంబీబీఎస్ బీ కేటగిరి సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడం వల్ల రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మరో 1,300 ఎంబీబీఎస్ సీట్లు దక్కాయి. ఈ రెండు నిర్ణయాల వల్ల తెలంగాణ విద్యార్థులకు అదనంగా మొత్తం 1,820 సీట్లు ప్రతి ఏటా దక్కనున్నాయి.

క్లుప్తంగా...

ఇరిగేషన్ ఏఈఈల పదోన్నతులకు హైకోర్టు ఓకే



సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో 11 ఏళ్ల సర్వీసున్న అసిస్టెంట్ ఇంజనీర్ల పదోన్నతికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వారంతా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతికి అర్హులేనని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జారీ చేసిన జీవో నంబర్ 112 సమర్థనీయమేనని స్పష్టం చేసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. నిబంధనలు సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెప్పింది. 2022, మార్చి 26న రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 112ను సవాల్ చేస్తూ నల్లగొండ మిర్యాలగూడకు చెందిన శ్రీనివాస్ నాయక్ సహా కొందరు ఏఈఈలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ జీవో తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ సర్వీస్ రూల్స్ 2018కి విరుద్ధమన్నారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం తుది ఉత్తర్వులు వెలువరించింది. ఏఈఈల ఇంప్లీడ్ పిటిషన్ వేసిన న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. ఏఈఈలకు కూడా పదోన్నతులు ఇవ్వవచ్చని గతంలో ఇదే హైకోర్టులోని డివిజన్ బెంచ్ ఉత్తర్వు లు జారీ చేసిందని చెప్పారు. వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ప్రభుత్వ జీవోను సమర్థించింది. జీవోకు వ్య తిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది.

'రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లూ బదిలీకి అర్హులే'

సాక్షి, హైదరాబాద్: రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్లు కూడా బదిలీలకు అర్హులేనని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే రెండేళ్ల కంటే ఎక్కువ సర్వీసున్న వారి బదిలీలు పూర్తయిన తర్వాత, మిగిలిన ఖాళీలకే తక్కువ సర్వీసున్న వారి దరఖాస్తులు పరిశీలించి, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. టీచర్ల బదిలీల కోసం ప్రభుత్వం జనవరి 25న జారీ చేసిన జీఓ నంబర్ 5, ఫిబ్రవరి 7న జారీ చేసిన జీఓ నంబర్ 9లో తమకు అవకాశం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ పెద్దపల్లి జిల్లాకు చెందిన సొదమల్ల స్రవంతితోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండేళ్ల సర్వీస్ పూర్తి కాలేదన్న కారణంగా తమను పరస్పర బదిలీకి కూడా అనుమతించకపోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, రెండేళ్లలోపు సర్వీసున్న టీచర్ల బదిలీలకూ అవకాశం ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

సంపద పెరగాలంటే పరిశ్రమలు రావాలి

- మంత్రి కేటీఆర్
- సంగారెడ్డి జిల్లాలో మొనిన్ పరిశ్రమకు శంకుస్థాపన



మొనిన్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న కేటీఆర్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజకీయాలు ఎన్నికలు వచ్చినప్పుడు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, సంపద పెరగాలన్నా కొత్త పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు పెడితే స్థానికులకు నష్టం జరుగుతుందని కొందరు రాజకీయం కోసం వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అపోహలకు గురికాకుండా స్థానిక నాయకులు పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రీమియం సిరప్ తయారీ కంపెనీ మొనిన్ రూ.300 కోట్ల పెట్టుబడితో సంగారెడ్డి జిల్లా గుంతపల్లిలో నిర్మించతలపెట్టిన ఫ్యాక్టరీకి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ప్రగతిశీల విధానాలను చూసి వివిధ దేశాలకు చెందిన కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మొనిన్ కంపెనీ యాజమాన్యం దేశంలో 18 రాష్ట్రాల్లో తిరిగిందని, చివరకు తెలంగాణలో యూనిట్‌ను స్థాపిస్తోందని చెప్పారు. స్థానిక యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఈ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.

ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానం..

రాష్ట్రం వ్యవసాయ రంగంలో గణనీయ వృద్ధిని సాధించిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 వేల మెట్రిక్ టన్నుల నుంచి మూడున్నర లక్షల టన్నులకు చేరి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి బాటలో కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, మొనిన్ సంస్థ చైర్మన్ ఒలివర్ మొనిన్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే ఇక ఉపేక్షించం

మరింత బలోపేతంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు: డీఎంఈ రమేశ్ రెడ్డి

గాంధీఆస్పత్రి: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని, ఆయా కళాశాలలకు చెందిన యాంటీ ర్యాగింగ్ కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూ పొందించి అమలు చేస్తామని మెడికల్ ఎడ్యు కేషన్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడిన పదిమంది వైద్యవిద్యార్థులను ఏడాది పాటు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ పలువురు వైద్యవిద్యార్థు లు గురువారం గాంధీ కళాశాల ప్రాంగణంలో నిర సన చేపట్టారు. ఈ క్రమంలో డీఎంఈ, గాంధీ ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమో హన్, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు తదిత రులు పలువురు వైద్యవిద్యార్థులతో మాట్లా డారు. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన ఆ పదిమంది సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధా రణ అయిందనీ, చర్యల విషయంలో పునరాలోచన లేదని స్పష్టం చేశారు.

అడిషనల్ డీజీ శిఖాగోయల్ ఆరా

ర్యాగింగ్ ఘటనపై తెలంగాణ అడి షనల్ డైరెక్టర్ జనరల్, ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ ర్యాగింగ్ కమిటీ అధికారి శిఖాగోయల్ ఆరా తీశారు. డీఎంఈ, గాంధీ ప్రిన్సి పాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించినట్లు తెలి సింది. సస్పెన్షన్‌తో ఏడాది వైద్యవిద్యను మాత్రమే కోల్పోతారని, కేసులు పెడితే విద్యార్థులు జీవితాలు నష్టపోవడంతో పాటు వారి కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతాయనే ఉద్దేశంతో సస్పెన్షన్‌తో సరిపెట్టామని డీఎంఈ రమేశ్‌రెడ్డి వివరించినట్లు సమాచారం.

'బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బిల్లుతో ఉపయోగం లేదు'



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోందని, ఈ బిల్లులో బీసీ మహిళలకు ప్రాధాన్యత లేకుంటే బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగినట్లేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ మహిళలకు ప్రాతినిథ్యం లేని మహిళా బిల్లుతో బీసీలకు ఉపయోగం లేదని, అందుకే మహిళా బిల్లును బీసీలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

టెట్ పరీక్షా కేంద్రాలున్న విద్యా సంస్థలకు ఒకటిన్నర రోజుల సెలవు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఈనెల 15న జరగనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలుగా ఎంపికైన విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకటిన్నర రోజుల పాటు సెలవు ప్రకటించింది. ఆ విద్యా సంస్థల్లో టెట్ పరీక్షల ఏర్పాట్ల కోసం ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం సగం పూట, పరీక్ష రోజైన 15వ తేదీ ఉదయం, మధ్యాహ్నం ఈ కేంద్రాలకు సెలవు ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ పరీక్షా కేంద్రాలున్నాయి. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఈ పరీక్షలు ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి



ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు ఎన్నికలు ముంచుకొస్తుండడంతో పరీక్షలు ఇంకెప్పుడు జరుగుతాయనే అయోమయానికి గురవుతున్నారు.

సన్నద్ధతకు సంకటం

ఏదైనా పరీక్ష తేదీని ప్రకటిస్తే అభ్యర్థులు సన్నద్ధతకు ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పూనుకోవడం, తదనుగుణంగా నోటిఫికేషన్లు ఇవ్వడంతో నిరుద్యోగ అభ్యర్థులు కఠోర దీక్షతో ప్రిపరేషన్‌లో పడ్డారు. కొందరు ప్రైవేటు ఉద్యోగాలను వదిలేసి మరీ సిద్ధమవుతున్నారు. మరికొందరైతే పనిచేస్తున్న ఉద్యోగాలకు దీర్ఘకాలిక సెలవులు పెట్టుకుని టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల తేదీలను ప్రకటించకుండా కమిషన్ కాలయాపన చేస్తుండటంతో సన్నద్ధత గాడి తప్పుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నెలంతా ప్రభుత్వ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు అర్హత పరీక్షలు కొనసాగుతుండగా.. వచ్చే నెలలో సైతం పలు పరీక్షలకు కమిషన్ తేదీలు ఖరారు చేసింది. ఆగస్టు నెలలో నిర్వహించాల్సిన గ్రూప్–2 పరీక్ష నవంబర్ నెలకు వాయిదా పడింది. ఈ విధంగా పలు పరీక్షల తేదీలు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. డీఏఓ, హెచ్‌డబ్ల్యూఓ, గ్రూప్–3 పరీక్షలపై తేల్చక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

హైదరాబాద్‌లో ఇన్‌స్పైర్ బ్రాండ్స్ ఇన్నోవేషన్ సెంటర్

కేటీఆర్‌తో భేటీ సందర్భంగా కంపెనీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మల్టీబ్రాండ్ రెస్టారెంట్ కంపెనీగా పేరొందిన 'ఇన్‌స్పైర్ బ్రాండ్స్' హైదరాబాద్‌లో ఆవిష్కరణల కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో బుధవారం భేటీ అయిన కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీఈఓ పాల్ బ్రౌన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 32 వేల రెస్టారెంట్లను కలిగిన ఇన్‌స్పైర్‌కు హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ఆవిష్కరణల కేంద్రం ఆరవదిగా కానుంది. హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న ఆవిష్కరణల కేంద్రం గత ఆరు నెలల్లో వంద మందికి ఉద్యోగాలు కల్పించగా, వచ్చే ఆరు నెలల్లో మరో వంద మందిని చేర్చుకోనుంది. 2025 నాటికి హైదరాబాద్‌లో మరో 500 మందిని చేర్చుకుంటుందని పాల్ బ్రౌన్ ప్రకటించారు. ఈ ఆవిష్కరణల కేంద్రం ద్వారా డేటాసైన్స్, అనలిటిక్స్, ఈ కామర్స్, ఆటోమేషన్, క్లౌడ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వంటి రంగాల్లో పనిచేసే సంస్థల భాగస్వామ్యంతో ఆవిష్కరణల కోసం పనిచేస్తుంది. ఆవిష్కరణల కేంద్రంలో ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా మానవ వనరుల నిర్వహణ, చెల్లింపు విధానాలు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు తదితరాల కోసం స్థానిక స్టార్టప్‌లతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంటుంది.

17 నుంచి 'ఆయుష్మాన్ భవ'

అక్టోబర్ 2 వరకు ఆరోగ్య మేళాలు, ఇతర సేవలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర పథకానికి సంబంధించి రాష్ట్రంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా పల్లె, బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ఈ నెల 20, 27 తేదీల్లో ఆరోగ్య మేళాలు నిర్వహిస్తారు. రక్తపోటు, మధుమేహం, మూడు సాధారణ క్యాన్సర్లు అంటే ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. టీబీ, లెప్రసీ వంటి పరీక్షలు చేస్తారు. లైఫ్‌స్టయిల్ వంటి కార్యక్రమాలు చేపడతారు. ఉచిత మందులు ఇస్తారు. ఉచిత డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉంటాయి. టెలీకన్సల్టేషన్ సేవలు కల్పిస్తారు. అక్టోబర్ 2న రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల సమన్వయంతో ప్రతి జిల్లాలో ఒక శిబిరాన్ని నిర్వహిస్తారు.

జిల్లా వార్తలు

అప్పీలా.. కొత్త నోటిఫికేషనా?!

- డోలాయమానంలో సింగరేణి అధికారులు
- జూనియర్ అసిస్టెంట్ పరీక్షను రద్దు చేసిన హైకోర్టు
- లోపభూయిష్టమైన విధానాలతో కోర్టుకెక్కుతున్న అభ్యర్థులు



క్లరికల్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్(క్లరికల్ గ్రేడ్–2) పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ 4వ తేదీన రాతపరీక్ష నిర్వహించారు. అయితే, కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో రాతపరీక్షను రద్దు చేసి మరోమారు నోటిఫికేషన్ ఇవ్వాలని గత నెల 28న హైకోర్టు సింగరేణిని ఆదేశించింది. కాగా, హైకోర్టు ఆదేశాలను పాటించాలా... లేక అప్పీల్‌కు వెళ్లాలా అనే అంశంపై సింగరేణి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులు పలువురు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉన్నందున సంస్థ కూడా ఏ నిర్ణయం తీసుకోవాలో తేల్చుకోలేక సందిగ్ధంలో ఉన్నట్లు తెలిసింది.

ఎనిమిదేళ్ల తర్వాత పరీక్ష

సింగరేణిలో సుమారు ఎనిమిదేళ్ల తర్వాత 177 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా సుమారు లక్ష మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా, స్క్రూటినీ అనంతరం 98,882 మందికి సంస్థ హాల్‌టికెట్లు జారీ చేసింది. వీరిలో 77,907 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎనిమిది జిల్లాల్లోని 187 కేంద్రాలను పరీక్ష నిర్వహించిన సంస్థ... గత ఏడాది సెప్టెంబర్ 9వ తేదీన ఫలితాలను విడుదల చేసింది. అయితే, కొందరు అభ్యర్థులకు ప్రశ్నపత్రం ఇవ్వకపోవడం, ఇంకొందరి ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాల బుక్‌లెట్లపై సంస్థ ముద్ర లేకపోవడంతో, మరికొందరిని తనిఖీ చేయకుండానే కేంద్రాల్లోకి అనుమతించారని చెబుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై వాదనల అనంతరం పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు తాజాగా తీర్పు చెప్పింది. ఏళ్ల తర్వాత నోటిఫికేషన్ రావడంతో కష్టపడి చదివిన అభ్యర్థులు ఎలాగైనా ఉద్యోగం సాధిస్తామనే నమ్మకంతో ఉన్న నేపథ్యాన సంస్థ తప్పిదాల కారణంగా హైకోర్టు నుంచి వచ్చిన తీర్పు వారిని నిరాశకు గురిచేసింది.

అధికారుల పట్టింపులేని తనంతోనే...

సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ పరీక్ష నిర్వహించిన రోజే ఫలితాలను విడుదల చేస్తుందని, తద్వారా ఎలాంటి అవకతవకలు జరగవనే నమ్మకం ఉండేది. అయితే, రానురాను సంస్థ తీరుపై అభ్యర్థులకు నమ్మకం సడలిపోయింది. 2015లో జరిగిన క్లరికల్ పరీక్షలోనూ అనేక తప్పిదాలు బయటపడ్డాయి. పోస్టులు అమ్ముకున్నారని, ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి ఉద్యోగాలు వచ్చాయనే అపవాదు ఎదురైంది. అయినప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇక ఓ అధికారి సామాజిక వర్గానికి చెందిన వారికే ఉద్యోగాలు వచ్చాయనే ఆరోపణలు ఉన్నా స్పందన రాలేదు. ఆ తర్వాత 01 మార్చి 2020న జరిగిన ఈఅండ్ఎం గ్రేడ్–2(ఎగ్జిక్యూటివ్ కేడర్) పరీక్షకు సైతం ఇతర రాష్ట్రాల అభ్యర్థులు హాజరుకాగా, సింగరేణి ఉన్నతాధికారులే గుర్తించారు.

ఆతర్వాత వారి విచారణ సాగుతుండగానే బెయిల్ రావడంతో కేసు తెరమరుగైంది. ఈకేసుకు సంబంధించి సంస్థ ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు తేలగా, ఫలితాలు వెల్లడించొద్దని పోలీసు ఉన్నతాధికారులు సూచించినా సంస్థ అధికారులు పెడచెవిన పెట్టి 68 పోస్టుల్లో 58 మందిని నియమించినట్లు ప్రచారం జరిగింది. ఇలా ఏ పరీక్ష నిర్వహించినా లోపాలు బయటపడుతున్నా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగ పరీక్షల్లో పేరున్న టీఎస్‌పీఎస్సీ వంటి సంస్థల అధికారుల సలహాలు తీసుకుంటే పరీక్ష పూర్తయ్యాక తలనొప్పులు ఎదురుకావని తెలిసినా ఆ దిశగా దృష్టి సారించకపోవడం గమనార్హం. ఫలితంగా ఎంతో ఆశతో నెలల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు చివరకు నిరాశకు గురి కావాల్సి వస్తోంది. కాగా, తాజాగా వెలువడిన హైకోర్టు తీర్పుపై సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్యను వివరణ కోరగా, కంపెనీ న్యాయ విభాగం ఉద్యోగులు, ఉన్నతాధికారులు త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిపారు.

రూ.కోట్లలో చెల్లించినా ...

సింగరేణి సంస్థలో నియామకాలకు సంబంధించి ఏ పరీక్ష అయినా గతంలో సంస్థే నిర్వహించేది. ఇటీవల బదిలీ వర్కర్లు 665 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు సుమారు 30 వేల మంది హాజరైనా ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తిచేశారు. అయితే, 2015, 2022లో నిర్వహించిన క్లరికల్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను మాత్రం బయటి సంస్థకు అప్పగించి రూ.3కోట్లు చెల్లించినట్లు సమాచారం. అయినా అనేక లోపాలు బయటపడడంతో కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా పరీక్షను రద్దు చేయాల్సి వచ్చింది. ఇకనైనా సంస్థ ఉన్నతాధికారులు నియామకాల విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.

బ్లాస్టింగ్ ఆపరేషన్స్‌ను తనిఖీ చేసిన జీఎం



బ్లాస్టింగ్‌ను పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీలో బొగ్గు వెలికితీతకు చేపడుతున్న బ్లాస్టింగ్ ఆపరేషన్స్‌ను సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్లాస్టింగ్ సందర్భంగా భారీగా శబ్దాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు వివరించారు. రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటూనే ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఓసీ ఎం.వీ.నర్సింహారావు, అధికారులు రామకృష్ణ, గోపికిషోర్, సురేష్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డికి పదోన్నతి



కట్టా దామోదర్‌రెడ్డి

పాల్వంచరూరల్: పాల్వంచ వన్యప్రాణుల సంరక్షణ విభాగం ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డికి పదోన్నతి లభించింది. ఆయనకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదోన్నతి కల్పిస్తూ పీసీసీఎఫ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, పాల్వంచ అటవీ డివిజన్ ఎఫ్‌డీఓ తిర్మల్‌రావు ఇటీవల అచ్చంపేటకు బదిలీ కాగా, ఆ స్థానంలో దామోదర్‌రెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు అందాయని డీఎఫ్ఓ కృష్ణగౌడ్ తెలిపారు.

తాలిపేరుకు కొనసాగుతున్న వరద

చర్ల: చర్ల మండలం పెదమిడిసిలేరు సమీపంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రం వరకు కూడా వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు రెండు రోజులుగా వరద వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లలో 10 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 6,489 క్యూసెక్కుల చొప్పున వరదను దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74మీటర్లు కాగా, వరద ఉధృతిని పరిగణనలోకి తీసుకుని 72.85 మీటర్ల వద్ద క్రమబద్ధీకరిస్తున్నారు.

పత్తి, మిర్చిని ఆశిస్తున్న తెగుళ్లు

సస్యరక్షణ చర్యలపై కేవీకే శాస్త్రవేత్తల సూచనలు



తల్లాడ : పత్తిలో తెగుళ్లను పరిశీలిస్తున్న వైరా కేవీకే శాస్త్రవేత్తలు

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లిలో బుధవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రవికుమార్, చైతన్య, జెస్సీ పత్తి, మిర్చి పైర్లను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా కీటకం విభాగం శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ పత్తి పంటలో పచ్చ దోమ, తామర పురుగుల ఉధృతి ఉన్నందున పచ్చదోమ నివారణకు పిప్రోవిల్ 400 మి.లీ. లేదా ఇమిడాక్లోపిడ్ 50 మి.లీ. లేదా పోనికామిడ్ 60 గ్రాములు, తామర పురుగు నివారణకు డయాపిన్థీయూరాన్ 250 గ్రాములను పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, సోకిన మిర్చి మొక్కలను పీకి నాశనం చేయాలని తెలిపారు. రైతులు ఏవీకే.రెడ్డి, శ్రీనివాస రెడ్డి, లక్ష్మారెడ్డి, ఒలేటి రవి, వ్యవసాయ విస్తరణాధికారి నాగేశ్వర్‌రావు, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తిలో పిండినల్లి

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటను పిండినల్లి ఆశించిందని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో పత్తి, మిర్చి పంటలను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. పత్తిలో కాండం చుట్టూ తెల్లగా పిండి మాదిరి చుట్టుకుని పురుగులు కాండం రసాన్ని పీల్చేడంతో చెట్టు ఎండిపోతుందన్నారు. పిండినల్లి కనిపించిన వెంటనే గోనె బస్తా లేదా కాటన్ బట్టతో తుడిస్తే కొంత ఫలితం ఉంటుందని తెలిపారు. ఇక ఉధృతి ఉంటే ప్రొఫెనోఫాస్ 2 ఎం.ఎల్.ను లీటర్ నీటికి కలిపి కాండం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఇక మిర్చిలో వేరుకుళ్లు నివారణకు కాపర్, స్ట్రెప్టోమైసిన్ కలిపి చెట్టు మొదట్లో చేతి పంపుతో పిచికారీ చేయాలని, పైముడత నివారణకు తగిన మందులు ఉపయోగించాలని సూచించారు. కాగా, రసాయన మందులు కాకుండా సేంద్రియ విధానాలు పాటిస్తే మేలని ఆయన తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయ షాపులు, చీరల టెండర్లు వాయిదా

కొబ్బరిచిప్పల వేలంలో రూ.2లక్షల మేర అదనపు ఆదాయం



టెండర్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న అధికారులు, పాలకమండలి సభ్యులు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మ తల్లి) గుడి సమీపాన నిర్మించిన షాపుల వేలం మరోమారు వాయిదా పడింది. అలాగే, అమ్మ వారికి భక్తులు సమర్పించిన చీరలు పోగు చేసుకునే హక్కు కోసం పోటీ లేకపోవడంతో వాయిదా వేశా రు. ఆలయంలో బుధవారం 11షాపుల కేటాయింపుతో పాటు చీరలు, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్. రజనీకుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం సమక్షంలో వేలం జరిగింది. కాగా, కొబ్బరిచిప్పలను ఏడాది పాటు పోగు చేసుకునేందు కు నలుగురు పోటీ పడగా కారేపల్లికి చెందిన పి.యాదలక్ష్మి రూ.10,51,000కు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.2.51లక్షల ఆదాయం అదనంగా లభించిందని ఈఓ తెలిపారు. ఇక 11 షాపుల్లో ఒకే షాపు కోసం నలుగురు, చీరలు పోగు చేసుకునేందుకు ముగ్గురే వేలంలో పాల్గొనడంతో ఈనెల 23వ తేదీకి వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు చింత నాగరాజు, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, గంధం వెంగళరావు, ఎస్.వెంకటరామారావు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలోనే సింగరేణికి కష్టాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఏర్పడ్డాక పాలకుల తీరుతో సింగరేణికి కష్టాలు ఎదురవుతున్నాయని ఏఐకేఎంఎస్ జాతీయ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు పి.మాధవనాయక్ ఆరోపించారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఏరియర్స్, బోనస్ చెల్లింపు విషయంలో జాప్యం చేయడం.. ఆపై ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. కార్మికులకు చెల్లించే ప్రతీపైసా వారి కష్టార్జితమేనని తెలిపా రు. అంతేకాక కార్మికులు చెమటోడ్చి రూ.వేలకోట్లను ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తున్నారని చెప్పారు. కాగా, కోల్ ఇండియాలో కార్మికులకు 23నెలల ఎరియర్స్‌ను ఈనెల 3వ తేదీనే చెల్లించినా సింగరేణిలో మాత్రం జాప్యం చేశారని మాధవనాయక్ విమర్శించారు. సమావేశంలో నాయకులు పవన్‌కుమార్, ఎం.రవి, ఊట్ల గణేష్, ఎం.శ్రీనివాసరావు, సుందర్, రాంసింగ్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, మోహన్, యాదగిరి పాల్గొన్నారు.

అధికారుల భిన్న ప్రకటనలపై నిర్వాసితుల్లో ఆందోళన

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో సాగు భూముల విషయమై వివిధ శాఖ అధికారులు చేస్తున్న భిన్నమైన ప్రకటనలతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సర్వే ప్రారంభ సమయాన సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో నాటి తహసిల్దార్, సర్వే ముగిసినప్పుడు అప్పటి ఆర్డీఓ రైతులకు భరోసా కల్పిస్తూ ప్రకటన చేశారు. నిర్వాసిత ప్రాంతం అటవీ, రెవెన్యూ భూభాగమైనా సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో భూములు కోల్పోయినా పరిహారం అందుతుందని రైతులు నమ్మారు. అనంతరం అనర్హుల పేర్లు నిర్వాసిత జాబితాలో చేరడంతో ఆందోళన చెందారు. ఇంతలోనే అధికారులు రీ సర్వేకు సిద్ధం కాగా, అటవీ, రెవెన్యూ భూముల హద్దులు కేటాయించాకే సర్వే చేయాలని రైతులు పట్టుపట్టడంతో వాయిదా పడింది. ఇదే సమయాన రైతులు వారి భూములకు సంబంధించి ఆధారాలు చూపాలని, వాణిజ్య పంటలు ఉంటే పరిహారం వర్తించదని అటవీశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. దీంతో రైతులు బుధవారం సర్వేకు హాజరుకాకుండా నేరుగా కలెక్టర్ ప్రియాంక అలను కలిసి సర్వే నంబర్ 549కి సంబంధించి ఏర్పడిన గందరగోళాన్ని వివరించారు.